
మక్తమహబూబ్‌పేట్ పాఠశాల పక్కన బురదమయం




పాఠశాల వెనుకభాగంలో చెత్త

అటు చెత్త.. ఇటు బురద

మక్తమహబూబ్‌పేట్ పాఠశాల పక్కన డంపింగ్ యార్డు

- దుర్వాసనతో విద్యార్థులు సతమతం
- యార్డు తొలగించాలని డిమాండ్

మియాపూర్: చెత్త డంప్‌తో స్కూల్ విద్యార్థులకు పెద్ద సమస్యే వచ్చి పడింది. డంపింగ్ యార్డులో వేసిన చెత్తను ఎప్పటికప్పుడు తరలించకుండా నిల్వ చేయడంతో రోజురోజుకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. విద్యార్థులతో పాటు పరిసరప్రాంతాల వారు అనారోగ్యంతో బాధపడుతున్నారు.

- మియాపూర్‌లోని మక్తమహబూబ్‌పేట్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో 700 మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.
- పాఠశాల సమీపంలో వెనుక భాగంలో 100,101 సర్వే నంబర్లలోని ఖాళీ స్థలంలో జీహెచ్‌ఎంసీ డంపింగ్ యార్డు ఉంది.
- శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీలలో చెత్తను ఆటోలు, లారీలలో ముందుగా డంప్ చేస్తారు. ఆపై జవహర్‌నగర్‌లో ఉన్న డంపింగ్ యార్డుకు తరలిస్తారు.
- అయితే చెత్త తరలింపులో అలసత్వం కారణంగా మక్తమహబూబ్‌పేట్ సమీపంలో ఉన్న యార్డులో చెత్త పేరుకుపోతోంది.
- ఓ వైపు దీప్తిశ్రీనగర్ ధర్మపురి దేవాలయం రోడ్డు వరకు, మరో వైపు మక్తమహబూబ్‌పేట్ పాఠశాల సమీపం వరకు చెత్త గుట్టలుగుట్టలుగా పేరుకుపోతోంది.
- వర్షాలు పడిన సమయంలో చెత్త అంతా కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది.
- పాఠశాల ముందు, పక్క నుంచి వందలాది చెత్త వాహనాలు డంపింగ్ యార్డుకు వెళుతుంటాయి. దీంతో ఆ ప్రాంతామంతా బురదమయంగా మారింది.
- పాఠశాల ఆవరణలో దుర్వాసన తట్టుకోలేక పిల్లలు కొన్ని సందర్భాల్లో వాంతులు, విరేచనాలు చేసుకుంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు.
- ఈగలు, దోమలు ఎక్కువగా ఉండడంతో అనారోగ్యం పాలవుతున్నారని పిల్లలను తల్లిదండ్రులు స్కూల్‌కు పంపడానికి ఇష్టపడడం లేదు.

ఆందోళన చేసినా.. ఫలితం లేదు

జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు వల్ల కాలనీవాసులందరికీ అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. దుర్వాసన వెదజల్లుతోంది. ఇక్కడ నుంచి డంపింగ్ యార్డును తొలగించాలని పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు చేశాం. అయినా స్పందన లేదు.

– నరేష్, దీప్తిశ్రీనగర్

స్కూల్ పక్కనే చెత్త వేస్తున్నారు

పాఠశాల పక్క నుంచి వందలాది చెత్తవాహనాలు డంపింగ్ యార్డుకు వెళుతుంటాయి. దీంతో ఈ ప్రాంతమంతా బురదమయంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. చెత్తను డంపింగ్ యార్డు లోపలికి తీసుకెళ్లకుండా కొందరు ఆటో డ్రైవర్లు స్కూల్ సమీపంలో వేసి వెళ్లిపోతున్నారు. దీంతో పాఠశాల చుట్టుపక్కల అపరిశుభ్రంగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలి.

–శ్రీకాంత్, మక్తమహబూబ్‌పేట్

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: సురక్ష ఎన్‌క్లేవ్ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు సురక్ష ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలోని విద్యానగర్, సురక్ష ఎన్‌క్లేవ్, సాయి ఎన్‌క్లేవ్, రాజేందర్‌రెడ్డి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. దీనికి విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

ఉచిత ధ్యాన శిక్షణ

మోతీనగర్: మోతీనగర్ అవంతినగర్ తోటలోని షిరిడి సాయిబాబా ఆలయంలోని ధ్యాన మందిరంలో 3వ తేదీ గురువారం ఉదయం 11 నుంచి రాత్రి వరకు ఉచిత ధ్యాన శిక్షణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు సాయిరత్న భీమినేని వంశీ కిరణ్‌లచే దివ్య జ్ఞానామృతం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అవంతినగర్ తోట వెల్ఫేర్ అసోసియేషన్, ఆలయ కమిటీ శ్రీ సాయి పిరమిడ్ ధ్యానగ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 12 మందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 11 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

ప్యాచ్ వర్కు పనులు ప్రారంభం


ప్యాచ్ వర్కు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మంగళవారం ఆల్విన్ కాలనీ ఫేజ్ 2 ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలను పూడ్చించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారి కావటం రద్దీ విపరీతంగా ఉండటంతో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పనులు చేయిస్తున్నామన్నారు. డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పరామర్శ

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని జిల్లా విద్యా అధికారి వెంకటేశ్వర్లు, తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, పటాన్‌చెరు మండల విద్యాధికారి రాథోడ్, సిబ్బందితో కలిసి ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలసి పరామర్శించారు. తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం డివిజన్ ఆర్థిక కార్యదర్శి వినోద్, కాశీనాథ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ దేవానందం, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి

పటాన్‌చెరు: నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తుందని అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సభ్యులు సుధాకర్‌రెడ్డిలు అన్నారు. మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వివిధ గ్రామాలకు చెందిన ఐదుగురు లబ్ధిదారులకు మంజూరైన లక్ష ముప్పై మూడువేల రూపాయల చెక్కులను వారు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల సర్పంచులు కృష్ణ, భాస్కర్ గౌడ్, రవి, సీనియర్ నాయకులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ప్రోత్సహించాలి



రామచంద్రాపురం (పటాన్‌చెరు): ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ సైనికుడు శివరాం అన్నారు. మంగళవారం భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆయన బూట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు అనేక అద్భుతాలను సృష్టిస్తారని అన్నారు.

తల్లి పాలలో పోషకాలు పుష్కలం


ర్యాలీలో డాక్టర్లు, వైద్యసిబ్బంది

మెడికవర్ ఆస్పత్రి పిడియాట్రిక్ విభాగం డైరెక్టర్ డా.రవీందర్‌రెడ్డి

మాదాపూర్: బ్రెస్ట్ మిల్క్ ఫీడింగ్ నుంచి పిల్లలకు పోషకాలు పుష్కలంగా లభిస్తాయని మెడికవర్ ఆస్పత్రి పిడియాట్రిక్ విభాగం డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం మాదాపూర్‌లో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు సులభంగా జీర్ణమవుతుందన్నారు. కొంతమంది బ్రెస్ట్ ఫీడింగ్ పట్ల ఇంట్రెస్ట్ చూపించడం లేదని, బ్రెస్ట్ ఫీడింగ్ వల్ల తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. శిశువుకు 6 మాసాల వరకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. దీనివల్ల బ్రెస్ట్ క్యాన్సర్ రిస్క్ తగుతుందన్నారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి డాక్టర్లు వంశీ, సవిత, అనిల్, సంజయ్, సంగీత, వైద్యబృందం ర్యాలీలో పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

శేరిలింగంపల్లి: ప్రభుత్వ స్కూళ్లలో మధ్యాహ్న భోజన కార్మికులు వండి పెట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి మండల సీఐటీయూ కార్యదర్శి కొంగరి కృష్ణ డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి హైస్కూల్ వద్ద మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులు అక్షయపాత్ర భోజనాన్ని అడ్డుకొని తిరిగి పంపి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పథకాల్లో మధ్యాహ్న భోజనం కూడా ఉందన్నారు. శేరిలింగంపల్లి మండల పరిధిలో 325 మంది మధ్యాహ్న భోజన కార్మికులు ఉన్నారన్నారు. గత 23 ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికీ ఎలాంటి సమాచారం లేకుండా అక్షయపాత్రకు మధ్యాహ్న భోజన సరఫరా బాధ్యతలు ఇవ్వడం ఎంతవరకు న్యాయం అని ప్రశ్నించారు. అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు శ్రీశైలం, షణ్ముకం కిరణ్, వరలక్ష్మి, గోపీ, యశోద, పద్మ, గౌరమ్మ, శోభ, గాయత్రి, రాణిబాయి, రాములు, షేక్ అలీ, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు


వేడుకల్లో యువ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం మున్సిపాలిటీ బీసీ కాలనీలో మంగళవారం ఫలహారం బండి ఊరేగింపును కాలనీ యువకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువ నాయకుడు వి.ప్రవీణ్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన రేణుక ఎల్లమ్మ, నల్ల పోచమ్మ అమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ అమ్మవార్ల కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.అనంతరం స్థానిక యువకులు ప్రవీణ్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, వెంకట్, రమేష్, శ్రీనివాస్, రాజశేఖర్, సాయి, మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సిల్క్ ఎక్స్‌పో



భాగ్యనగర్‌కాలనీ: హెచ్‌యంటీ హిల్స్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన సిల్క్ ఎక్స్‌పోకు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకులు వికాస్‌జైన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నగర ప్రజలకు అన్ని రకాల ఫ్యాషన్ వస్తువులను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఈ ప్రదర్శనను సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. ప్రదర్శనలో చేనేత వస్త్రాలతో పాటు డిజైన్, ఖాదీ వస్తువులు పోచంపల్లి శారీస్, సల్వార్‌సూట్స్‌తో పాటు కశ్మీర్ శాలువాలు, వన్ గ్రామ్ జ్యువెలరీ, పెయింటింగ్స్ వివిధ రకాల వస్తువులు కొలువుదీరాయని తెలిపారు. ఈ ప్రదర్శన ఆగస్టు 15 వరకు కొనసాగుతుందని, రోజు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఈ బస్టాప్‌లో కూర్చునేదెలా..?

బంజారాహిల్స్: పంజగుట్ట నిమ్స్ ముందున్న బస్టాప్‌లు దుర్వాసన, దుర్గంధానికి కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. నిత్యం ఈ బస్టాప్ మీదుగా వందలాది మంది వివిధ గమ్యస్థానాలకు చేరుతుంటారు. కానీ రాత్రి అయ్యిందంటే చాలు ఈ బస్టాప్‌లో మందుబాబులు తిష్టవేసి ఓపెన్‌బార్‌గా మారుస్తున్నారు. నడి రోడ్డుపై ఇంత జరుగుతున్నా స్థానికంగా సంబంధిత అధికారుల చర్యలు శూన్యం అని స్థానికులు వాపోతున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు తోడు ఈ బస్టాప్‌లో నిత్యం మురుగు ప్రవహిస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు.


పంజగుట్ట నిమ్స్ బస్టాప్

సమస్యలు పరిష్కరించాలని వినతి


వినోద్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న సైబరాబాద్ హోంగార్డులు

రాయదుర్గం: హోంగార్డుల సమస్యలను పరిష్కరించేలా చూడాలని కోరుతూ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్‌కు సైబరాబాద్ పరిధిలోని హోంగార్డులు వినతిపత్రాన్ని అందించారు. మంగళవారం ఆయనను నగరంలో సైబరాబాద్ హోంగార్డుల అధ్యక్షులు అశోక్‌కుమార్, డాక్టర్ కొత్వాల్ దయానంద తదితరులు కలిశారు. సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా చేస్తామని ఆయన హామీ ఇచ్చారని అశోక్‌కుమార్ తెలిపారు.

లక్ష ఆర్థిక సహాయానికి దరఖాస్తు చేసుకోండి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం లక్ష రూపాయల ఆర్థిక సహాయం పథకాన్ని ప్రవేశ పెట్టిందని, పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో అర్హులైన క్రిస్టియన్ మైనార్టీలు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 14వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని సూచించారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

బాస్కెట్‌బాల్ టోర్నీలో ఓక్రిడ్జ్ ప్రతిభ



రాయదుర్గం: అంతర్ పాఠశాలల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో ఖాజాగూడలోని ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాల విద్యార్థుల బాస్కెట్ బాల్ జట్టు ప్రతిభ చాటింది.నగరంలో సెయింట్ పాల్స్ హైస్కూల్ ఆధ్వర్యంలో ఈ బాస్కెట్‌బాల్ టోర్నీని నిర్వహించారు. ఈ పోటీలలో ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాలకు చెందిన గ్రేడ్–10 జట్టు రన్నరప్‌గా నిలిచింది. జట్టు సభ్యులకు ట్రోఫీతోపాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. మంగళవారం ఖాజాగూడలోని ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాలలో ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ దీపికారావు, వైస్ ప్రిన్సిపల్స్ రుక్మిణీకుమార్, శ్వేతావర్మ, స్పోర్ట్ కోఆర్డినేటర్ డేవిడ్ రాజ్‌కుమార్, కోచ్ కిషోర్ పిడికిటి విద్యార్థులను అభినందించి ట్రోఫీని అందించారు.

ఓటరు జాబితాపై నాయకులతో సమావేశం



పటాన్‌చెరు టౌన్: ఓటర్లు స్థానికంగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి తో పాటు వివిధ పార్టీల నాయకులు తహసిల్దార్ పరమేశం, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి (రిటర్నింగ్ అధికారి) దేవుజను కోరారు.మంగళవారం వివిధ పార్టీ నాయకులతో ఓటర్ జాబితా ,నూతన పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, ఉన్న పోలింగ్‌స్టేషన్ల మార్పులు చేర్పులపై చర్చించారు. కార్యక్రమంల మాస్టర్ ట్రైనర్ అమరేందర్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- ఆయా ఆర్టీసీ డిపోల్లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం


హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో వద్ద .. ఎమ్మెల్యే గాంధీ, సాయిబాబా, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్

రాయదుర్గం: ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం , సంస్థ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం చారిత్రక నిర్ణయమని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఈ మేరకు గచ్చిబౌలి హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోలో డిపో ఉద్యోగులు, మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలనుకోవడం, 43,373 మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని నిర్ణయించడంతో అందరికీ ఎంతో మేలు చేకూరుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో చారిత్రక నిర్ణయాల్లో ఇదీ ఒకటిగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ హెచ్‌సీయూ డిపో ఉద్యోగులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు, ఏరియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మియాపూర్‌లో..

మియాపూర్: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కార్మికుల పక్షపాతి అని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. టీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ తీసుకున్న నిర్ణయం సందర్భంగా మియాపూర్‌లోని ఆర్‌టీసీ డిపో–1, డిపో–2 లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఈ నిర్ణయం దేశానికే ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, ఆర్‌టీసీ ఉద్యోగస్తులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మెట్రోస్టేషన్ వద్ద ..

మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో కారిడార్ విస్తరణ చేపట్టాలని సీఎం నిర్ణయం తీసుకున్న సందర్భంగా మియాపూర్ మెట్రోస్టేషన్ వద్ద పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు హమీద్ పటేల్, జగదీశ్వర్‌గౌడ్, నార్నె శ్రీనివాస్‌రావు, ఉప్పలపాటి శ్రీకాంత్ బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మియాపూర్ ఆర్‌టీసీ డిపోలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

దుర్గం చెరువులో దూకిన విద్యార్థిని

కాపాడిన లేక్ పోలీసులు, బోటింగ్ సిబ్బంది

మాదాపూర్: కేబుల్‌బ్రిడ్జిపై నుండి దుర్గం చెరువులోకి దూకి ఆత్మహత్యాయత్నం చేసిన బాలికను పోలీసులు రక్షించిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బి పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే బాలిక ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతుంది. మొబైల్ ఫోన్ ఎక్కువగా ఉపయోగిస్తుండడం, ఇన్‌స్టాగాంలో చాటింగ్ చేయడం గమనించిన తల్లి మందలించడంతో మంగళవారం ఉదయం 7.30 గంటలకు కాలేజీకి వెలుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్ళింది. కాలేజీకి వెళ్ళలేదు అన్న సమాచారం తెలుసుకున్న తల్లి కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాలిక ఫోన్‌ను ట్రాక్ చేసిన పోలీసులు దుర్గం చెరువు వద్ద ఉన్నదని తెలియడంతో మాదాపూర్ పోలీసులుకు సమాచారం అందించారు. దీంతో మాదాపూర్ ఐసీ సమాచారం మేరకు లేక్ పోలీసులు, బోటింగ్ సిబ్బంది, ఐటీ మొబైల్ స్టాఫ్ అప్రమత్తమై చెరువులోకి దూకిన బాలికను రక్షించి చికిత్స కోసం మెడికవర్ ఆసుపత్రికి తరలించారు.ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు.

సమావేశం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ పుష్పనగేష్, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్, జలమండలి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మంజూరైన సీసీ రోడ్డు పనులు, డ్రైనేజీ పైప్‌లైన్ పనులను త్వరగా ప్రారంభించాలని కోరారు.

ఆకట్టుకున్న 'సుస్థిరత మీ చేతుల్లో'



మాదాపూర్: మాదాపూర్‌లోని మెరిడియన్ స్కూల్‌లో స్యాహి ఆర్ట్ అండ్ లిటరరీ ఫెస్ట్‌ను మంగళవారం నిర్వహించారు. ఇందులో నగరంలో 45 కంటే ఎక్కువ పాఠశాలల నుంచి 2,500 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోగా మరి కొంతమంది వ్యక్తిగతంగా పాల్గొన్నారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. మెరిడియన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకురాలు రేణుకాబుట్ట, సీఓఓ అమోఘ్ బుట్టా, ప్రిన్సిపల్ కె భవాని, వైస్ ప్రిన్సిపల్ అనితా కమల్ పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ చాటిన వారికి ట్రోఫీలు, బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.